క్లుప్తంగా

డంపింగ్ యార్డును తరలించండి



మరికల్: మండల కేంద్రంలోని డంపింగ్ యార్డును వేరే చోటికి మార్చాలని ఇబ్రహీంపట్నం గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామానికి సమీపంలోనే డంపింగ్ యార్డు ఉండటం వల్ల చెత్తకు నిప్పు పెట్టినప్పుడు పొగతో పాటు దుర్వాసన వస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా డంపింగ్ యార్డు కిందనే ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు ఉండటం వల్ల చెరువులోకి వ్యర్థ పదార్థాలు చేరి నీళ్లు కూడా కలుషితమవుతున్నాయని వాపోతున్నారు. కుక్కల బెడద కూడా అధికంగా ఉండటం వల్ల గ్రామం నుంచి మరికల్‌కు వెళ్లాలంటే భయమేస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డంపింగ్ యార్డును వేరే చోటికి మార్చాలని విన్నవించారు.

నిరుపయోగంగా చెత్త సేకరణ రిక్షాలు



మరికల్: గ్రామాలను శుభ్రంగా ఉంచేందుకు గత ప్రభుత్వం పంపిణీ చేసిన చెత్త సేకరణ రిక్షాలు నిరుపయోగంగా మారాయి. చెత్త ట్రాక్టర్ వెళ్లని కాలనీలకు కార్మికులు ఎవరూ కూడా రిక్షా బండ్లను తీసుకోకపోవడంతో అవి మూలన పడ్డాయి. దీంతో వర్షాలకు తడుస్తూ, ఎండలకు ఎండుతు తుప్పు పడుతున్నాయి. అధికారులు స్పందించి గ్రామాల స్వచ్ఛతను దృష్టిలో ఉంచుకొని రిక్షా బండ్లను వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి

కొత్తపల్లి: మండలంలో కొనసాగుతున్న ప్రభుత్వ భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు, కొడంగల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి తిరుపతి రెడ్డి అధికారులకు సూచించారు. కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన ఆయన మండలంలో కొనసాగుతున్న ప్రభుత్వ కార్యాలయాల భవనాల పనులను పరిశీలించారు. కొత్తపల్లి, గుండుమాల్ మండలాల్లో ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు సీఎం రేవంత్ రెడ్డి రూ.17.60 కోట్లు మంజూరు చేయించగా గుత్తేదారులు పనులు చేపట్టారు. ఈ క్రమంలో కాడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డితో కలిసి భవన నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే నిర్మాణ పనుల్లో ఆలస్యం అవడం, పిల్లర్ గుంతల్లో వర్షపు నీరు నిలవడంతో కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. భవనం చుట్టూ నీరు నిల్వకుండా కాలువలు నిర్మించాలన్నారు.

ప్రధాని మోదీ రైతుల పక్షపాతి

మక్తల్: అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా 14 రకాల పంటలకు మద్దతు ధర పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ప్రధాని నరేంద్ర మోదీ రైతుల పక్షపాతిగా నిలిచిపోయారని బీజేపీ నియోజకవర్గ ఇంచార్జి కర్నె స్వామి, మాజీ ఎంపీటీసీ బల్‌రాంరెడ్డి అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. మోదీ కిసాన్ సమ్మాన్ పథకం ద్వారా అర్హత గలిగిన రైతులందరికీ పెట్టుబడి సాయం చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో బీజేపీ నాయకులు జయానందరెడ్డి, నర్సప్ప, ప్రతాప్‌రెడ్డి, కనకరాజు, మల్లేష్, రాఘవేంద్ర, తిమ్మప్ప పాల్గొన్నారు.

శివాజీ ఫౌండేషన్ అధ్యక్షుడి మృతికి సంతాపం

నారాయణపేట రూరల్: శివాజీ ఫౌండేషన్ అధ్యక్షుడు, రిటైర్డ్ ఆంగ్ల ఉపాధ్యాయులు మాండ్రే నర్సింహులు (89) అనారోగ్యంతో శుక్రవారం మరణించారు. ఈ క్రమంలో పలు వ్యాపార సంస్థలు, రాజకీయ ప్రముఖులు ఆయన మృతికి సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో శివాజీ విగ్రహం ఏర్పాటుకు ఎనలేని కృషి చేశారని ఆయన సేవలను కొనియాడారు.

పెద్ద చెరువు కట్టపై మొక్కల పెంపకం

మరికల్: మండల కేంద్రంలోని పెద్ద చెరువు ఆనకట్టపై పునః నిర్మాణం జరుగుతున్న కట్ట మైసమ్మ ఆలయం దగ్గర శుక్రవారం యువక మండలి మాజీ సభ్యులు మొక్కల పెంపకం చేపట్టారు. గతంలో కట్ట మైసమ్మ ఆలయాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో గ్రామస్తులు అందరు కలిసి ఆలయ పునః నిర్మాణ పనులు చేపట్టారు. ఈ క్రమంలో ఆలయం చుట్టు అలాగే ఆనకట్టపై అశోక చెట్లను నాటినట్లు మండలి మాజీ అధ్యక్షుడు మల్లయ్య తెలిపారు.

నత్తనడకన రైతుల డిజిటలైజేషన్



రైతు వేదికలో వివరాలు నమోదు చేస్తున్న ఏఈఓ

- ఇప్పటి వరకు 984 మంది రైతులు మాత్రమే రిజిస్ట్రేషన్
- జూన్ 6తో ముగియనున్న గడువు
- యాప్‌లో సాంకేతిక సమస్యలు

ధన్వాడ: కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని డిజిటలైజేషన్ చేయాలని లక్ష్యంలో భాగంగా రైతులకు గుర్తింపు కార్డు జారీ చేసేందుకు చర్యలు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి అగ్రి స్టాక్ తెలంగాణ ఫార్మర్ ఈ రిజిస్ట్రీలో రైతులకు ఉన్న భూముల వివరాలను నమోదు చేసే ప్రక్రియను ఈ నెల 5 నుంచి ప్రారంభించారు. ధన్వాడ మండలంలోని రైతు వేదికలలో మండల వ్యవసాయశాఖ అధికారులు నమోదు వివరాలను చేపట్టారు. అయితే వరి కొనుగోలు, డబ్బులు రైతుల ఖాతాలో జమ చేయడానికి సంబంధించిన పనులతో పాటు యాప్‌లో సాంకేతిక సమస్యల వల్ల నమోదు ప్రక్రియ నత్త నడకన సాగుతోంది.

984 మంది రైతులు మాత్రమే డిజిటలైజేషన్

మండలంలో 11,880 మంది రైతులు ఉండగా ఇప్పటి వరకు కేవలం 984 మంది రైతుల వివరాలు మాత్రమే ఏఈఓలు నమోదు చేశారు. క్లస్టర్ పరిధిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న రైతులు తమ వివరాలను అందించడంలో ఆలస్యం చేస్తున్నారు. రైతు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసు పుస్తకంలోని భూముల వివరాలను యాప్‌లో నమోదు చేయగానే 11 నంబర్ల ప్రత్యేక యూనిక్ కోడ్ కేటాయిస్తారు. అయితే ప్రతి ఎంట్రీకి మూడు ఓటీపీలను ఎంట్రీ చేయాల్సి ఉంటుంది. దీంతో నెట్‌వర్క్ సమస్యలతో పాటు యాప్‌లో సాంకేతిక కారణాలు తలెత్తినప్పుడు ఎంట్రీ ప్రక్రియ ఆలస్యం అవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. నమోదుకు జూన్ 6వ తేదీ వరకే గడువు ఉండడంతో రైతుల వివరాల సేకరణలో ఏఈఓలు నిమగ్నమయ్యారు. అయితే ఏఈవోలకు పచ్చి రొట్టి విత్తనాల పంపిణీ, మట్టి నమూనాల సేకరణ తదితర పనులు అప్పగించడంతో వివరాల నమోదుకు ఆలస్యం అవుతుంది.

సాంకేతిక కారణాలతోనే ఆలస్యం



ఏఈవోలు అన్ని గ్రామాలలో రైతుల వివరాలను ఈ-ఫార్మర్ రిజిస్ట్రీ యాప్‌లో నమోదు చేస్తున్నారు. కొన్ని సాంకేతిక కారణాలతో వివరాల నమోదులో జాప్యం జరుగుతుంది. అయినా గడువులోగా రైతులందరీ వివరాలను నమోదు చేయడమే లక్ష్యంగా ఏఈవోలు పనిచేస్తున్నారు. గడువులోగా వివరాల నమోదు పూర్తి చేస్తాం. – నవీన్ కుమార్, మండల వ్యవసాయశాఖ అధికారి, ధన్వాడ

ఆర్థిక భరోసా కల్పనే ప్రభుత్వ లక్ష్యం



కోస్గిలో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న తిరుపతి రెడ్డి

కోస్గి రూరల్: పేదలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతి రెడ్డి, కడా చైర్మన్ వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో గుండుమాల్, కోస్గి మండల పరిధిలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ , మైనారిటీ వర్గానికి చెందిన 126 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి , షాది ముబారక్ చెక్కులను శుక్రవారం వారు పంపిణీ చేశారు. అంతకు ముందు గుండుమాల్ మండల కేంద్రానికి మంజూరైన ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణ పనులను పరిశీలించారు. భవన నిర్మాణాన్ని గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్ , మండల తహసీల్దార్ భాస్కరస్వామి , ఉప తహసీల్దార్ కరుణాకర్, మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి , విక్రం రెడ్డి , మధుకర్‌రావు , ప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో ప్రతి పేదవాడికి లబ్ధి

మద్దూరు: కాంగ్రెస్ పాలనలో ప్రతి పేదవాడికి లబ్ధి చేకూరుతుందని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి తిరుపతిరెడ్డి తెలిపారు. శుక్రవారం మద్దూరు పట్టణ శివారులోని రైతు వేదికలో మండలంలోని లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాది ముబారక్ చెక్కులను కడా అధికారి వెంకట్‌రెడ్డితో కలిసి పంపిణీ చేశారు. అనంతరం మట్లాడుతూ కొడంగల్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు.

ధూమపానం వద్దు.. ఆరోగ్యమే ముద్దు

నారాయణపేట రూరల్: ధూమపానానికి అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని లీగల్ సర్వీసెస్ సంస్థ సెక్రటరీ వింధ్య నాయక్ అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని పొగాకు వినియోగంతో కలిగే అనర్థాలపై శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పొగాకు వినియోగం కారణంగా ప్రతి సంవత్సరం కోటి మందికి పైగా మరణిస్తున్నట్లు తెలిపారు. ధూమపానం వద్దని.. ఆరోగ్యమే ముద్దని సూచించారు. అనంతరం ధూమపానం మానేయడానికి చిట్కాలు తెలియచేసి పొగాకు రహిత సమాజ నిర్మాణానికి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ సురేష్ కుమార్, లీగల్ ఎయిడ్ కౌన్సెల్ లక్ష్మిపతి గౌడ్, లేబర్ ఆఫీసర్ మహేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ భోగీశ్వర్, డిప్యూటీ డీఎంహెచ్వో డాక్టర్ శైలజ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వింధ్య నాయక్

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యావంతులు

దామరగిద్ద: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు కాంప్లెక్స్ జీహెచ్ఎం అన్నపూర్ణ, జీపీఎస్ ఎచ్ఎం శేర్ కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కాన్‌కుర్తి జీపీఎస్ పాఠశాల ఆవరణలో విద్యావంతులు, గ్రామ పెద్దలతో 'బడిబాట' కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలల్లో ఉచిత విద్య భోజనం, పాఠ్యపుస్తకాలతో పాటు ఈ ఏడాది నోటు పుస్తకాలను విద్యార్థులకు అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులకు పంపించేందుకు కృషి చేస్తామని విద్యావంతులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు సీఆర్‌పీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చదువుతో పాటు కంప్యూటర్ శిక్షణ తప్పనిసరి

ఆత్మకూర్: విద్యార్థులకు చదువుతో పాటు కంప్యూటర్ శిక్షణ పొందడం వల్ల ఎంతో ఉపయోగం ఉంటుందని తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కొత్తకోట సీతాదయాకర్ రెడ్డి అన్నారు. స్వామి వివేకానంద సేవా సమితి ఆత్మకూర్, వాగ్దేవి జూనియర్ కళాశాల వారి ఆధ్వర్యంలో స్థానిక సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో నిర్వహిస్తున్న ఉచిత కంప్యూటర్ శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. వేసవి సెలవుల్లో నెల రోజుల పాటు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ పొందిన విద్యార్థులకు సీతమ్మ సర్టిఫికెట్లను అందజేశారు. ఈసందర్భంగా నిర్వాహకులు స్వప్న, బాలు, సంతోష్, శ్రీనును అభినందించారు. కార్యక్రమంలో ఎంఈఓ కొండాపురం బాలరాజు, గాలిపంపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణానికి రూ.3 లక్షల విరాళం

ఆత్మకూర్: పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న పోశమ్మ, కర్రెమ్మ, లింగమయ్య, కోటమైసమ్మ, కట్టమైసమ్మ, భూలక్ష్మమ్మ, బొడ్రాళ్ల ఆలయాల నిర్మాణానికి శుక్రవారం మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గాయత్రి రవికుమార్ దంపతులు రూ.3 లక్షలు విరాళంగా అందజేశారు. ఆలయాల నిర్మాణానికి, ప్రతిష్ఠాపనోత్సవానికి రూ.3 కోట్లకు పైగా ఖర్చు అవుతుందని, భక్తులు పెద్దఎత్తున విరాళాలు అందించాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు డాక్టర్ మొగిలి శ్రీధర్‌గౌడ్, నిర్వాహకులు అశ్విన్‌కుమార్, ఆనంద్, కొండాపురంరాము, మణివర్ధన్‌రెడ్డి, ఎస్టీడీ శ్రీను, శివానంద్, రమాకాంత్, నాగేష్, వెంకటేష్, యాదగిరిశెట్టి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ అందజేత

దేవరకద్ర: కౌకుంట్ల మండలం రేకులంపల్లికి చెందిన రాములు అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేటు ఆ స్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడి వైద్యఖర్చు ల నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ. 2.50లక్షల ఎల్‌ఓసీని శుక్రవారం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తన నివాసంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆపత్కాలంలో నిరుపేదలను ఆదుకునేందుకు సీఎం సహాయ నిధి ఎంతో దోహద పడుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఎవరికి ఏ ఆపద వచ్చినా ఆదుకోడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.



పర్యావరణాన్ని రక్షించుకుందాం



హరితహారం కార్యక్రమంలో పాల్గొన్న ఆదిత్య పరాశ్రీ స్వామి

ఊట్కూరు: వర్షాకాలంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడుదామని ఆదిత్య పరాశ్రీ స్వామి అన్నారు. శుక్రవారం బిజ్వార్‌లోని అంబత్రయ క్షేత్రంలోని ఆశ్రమ పరిసరాల్లో భక్తులు చేపట్టిన హరితహారం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నేరేడు, ఉసిరి, రాగి, బిల్వపత్రి, వేప తదితర మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఇళ్ల పరిసరాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. పర్యావరణాన్ని రక్షించడం వల్ల భవిష్యత్‌లో సంవృద్ధిగా వర్షాలు కురుస్తాయని, కరువు కాటకాలు దరి చేరవన్నారు. కార్యక్రమంలో భక్తులు అశ్విని మణిదీప్, రాఘవేంద్ర, భువనేశ్వరీ, శ్యాంకుమార్ పాల్గొన్నారు.

ఎంపీ డీకే అరుణకు ఆహ్వానం



ఎంపీ డీకే అరుణకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న గ్రామస్తులు

మాగనూర్: మండలంలోని తళంకేరి గ్రామంలో ఈ నెల 31 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే ఆంజనేయస్వామి, శివలింగం, నంది, నవగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవానికి విచ్చేయాలని ఎంపీ డీకే అరుణమ్మకు గ్రామస్తులు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం ఆంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్ని వేడుకను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై అవగాహన

మద్దూరు: మండలంలోని పల్లెగడ్డతాండలో ఇందిరమ్మ ఇళ్లకు హౌసింగ్ డీఈ హరికృష్ణ, ఎంపీడీఓ నర్సింహారెడ్డి, ఎంపీఓ నాగన్నలు లబ్ధిదారుల ఇళ్లకు మార్కింగ్ వేశారు. అనంతరం ప్రభుత్వం సూచించిన విధివిధానాలకు అనుగుణంగా ఇళ్లు నిర్మించుకోవాలని లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. తాండలో మొత్తం 15 మందికి ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో తాండ నాయకులు అనిల్ నాయక్, లక్ష్మణ్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

అమరచింత: పరిసరాలు శుభ్రంగా ఉంటే ఇంటిల్లిపాది ఆరోగ్యంగా ఉండొచ్చని డాక్టర్ రూపశ్రీ అన్నారు. ఫ్రైడే.. డ్రైడే కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 4వ వార్డులో శుక్రవారం పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ మేరకు కాలనీ వెంట ఉన్న మురుగుకాల్వలలో దోమలు వ్యాప్తి చెందకుండా మందులను పిచికారీ చేయించారు. రహదారులపై నిలిచిన వర్షను నీటిలో దోమలు, ఈగల నివారణ కోసం మందును చల్లారు. వర్షకాలం సమీపిస్తుండటంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు దోమతెర వాడడంతో ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ సురేందర్ గౌడ్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠాపన



ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో మాట్లాడుతున్న నాగురావు నామాజీ

నారాయణపేట రూరల్: మండలం ఊటకుంటతాండలో తుల్జా భవానీ, సంత్ సేవాశాల్ విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా జరిగింది. మూడు రోజుల పాటు వివిధ పూజ కార్యక్రమాలు నిర్వహించి శుక్రవారం వేదమంత్రోచ్చరణల మధ్య శాస్త్రీయంగా ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో బీజేపీ రాష్ట్ర సీనియర్ నేత నాగురావు నామాజీ అమ్మవారికి, సేవాలాల్‌కు ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భవానీ మాత సేవాలాల్ ఆశీర్వాదాలు అందరికీ ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో బీజేపీ రాష్ట్ర నాయకులు శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ నర్సింహులు గిరిజన నాయకులు పాల్గొన్నారు.

జమ్ముల ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు

కోస్గి రూరల్: పట్టణంలోని జమ్ముల ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. పూజల్లో భాగంగా శుక్రవారం ఉదయం నుంచి ఎల్లమ్మ విగ్రహానికి విశేష అభిషేకాలు, యంత్ర ప్రతిష్ఠ , ప్రాణ ప్రతిష్ఠ , పూర్ణాహుతి అనంతరం అన్నదాన కార్యాక్రమాలను చేపట్టారు. సాయంత్రం అమ్మవారికి ఘనంగా భోనాలను చేపట్టి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో రాజెళ్లి అంజిలయ్య, మల్లేష్ , శ్రీనివాస్ ,హన్మంతు, వన్నెకారి రాజు తదితరులు ఉన్నారు.



ఎల్లమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న వేదపండితులు

నర్సరీలను పరిశీలించిన ఎంపీడీఓ

మాగనూర్: మండలంలోని వడ్వాట్ గ్రామంలో నర్సరీలలో మొక్కలను ఎంపీడీవో రహ్మతుద్దీన్ శుక్రవారం పరిశీలించారు. విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సరిపడా మొక్కలను అందించడమే లక్ష్యంగా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. అలాగే ఈ సంవత్సరం వన మహోత్సవంలో చెట్లు నాటడానికి అనుకూలమైన స్థలాలు చూడాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



వడ్వాట్‌లో నర్సరీని పరిశీలిస్తున్న రహ్మతుద్దీన్

రజతోత్సవ సంబరాలకు తరలిరండి



టీజేఎఫ్ రజతోత్సవాల వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న సురేష్ కుమార్

మాగనూర్: ఈనెల 31న జరిగే టీజేఎఫ్ రజతోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాగనూర్ తహసీల్దార్ సురేష్ కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం రజతోత్సవ వేడుకలకు సంబంధించిన గోడపత్రికలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. మండలంలో పనిచేస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి టీజేఎఫ్ నిరంతరం పాటుపడతోందన్నారు. అనంతరం మాగనూర్ జర్నలిస్టులు మాట్లాడుతూ హైదరాబాద్‌లోని జలవిహార్‌లో ఈనెల 31న టీజేఎఫ్ రజతోత్సవ సభ జరగనుందని, సభకు జర్నలిస్టులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాగనూర్ జర్నలిస్టు సంఘం నాయకులు చంద్రశేఖర్, దండు రాము, శివకుమార్, శ్రీనివాసు, రాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నవీన్ కుమార్

తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర

నారాయణపేట: తెలంగాణ జర్నలిస్టు ఫోరం రజతోత్సవ సంబరాలకు జర్నలిస్టులు పెద్దఎత్తున తరలిరావాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ హెచ్ 143 జాతీయ కార్యవర్గ సభ్యులు వారధి నవీన్ కుమార్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కలాల్ ఆనంద్ కుమార్ గౌడ్ కోరారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో అత్యంత కీలకపాత్ర పోషించిన టీజేఎఫ్ 25 వసంతాల వేడుకలను ఈనెల 31న హైదరాబాద్‌లో జరుపుకోనున్నట్లు తెలిపారు. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు రథోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నామని, పాత్రికేయులు అందరూ తరలిరావాలన్నారు.

తిమ్మారెడ్డిపల్లి తండాలో ఖాళీ బిందెలతో నిరసన



తిమ్మారెడ్డిపల్లి తండాలో నిరసన తెలుపుతున్న మహిళలు

ఊట్కూరు: మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లి తండాలో శుక్రవారం మహిళలు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. తండాలో వారం రోజులుగా సిబ్బంది తాగునీరు సరఫరా చేయడం లేదు. గ్రామంలో నీటి ఎద్దడి నెలకొన్న అధికారులు పట్టించుకోకపోవడంతో మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న బీజేపీ గ్రామ అధ్యక్షుడు రాథోడ్ సంతోష్ నాయక్ మహిళలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి గ్రామంలో నెలకొన్న నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మహిళలు లక్ష్మీబాయి, వెంకటమ్మ, రాజు, లక్ష్మమ్మ, రేఖాబాయి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో విత్తన పాకెట్లను పరిశీలిస్తున్న ఎంఏఓ, ఎస్‌ఐ

దామరగిద్ద: నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎంఏఓ మణిచందర్, ఎస్‌ఐ రాజు హెచ్చరించారు. మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో శుక్రవారం వారు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా దుకాణాల్లో పత్తి, కంది, పెసర తదితర విత్తన ప్యాకెట్లను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రైతులకు విధిగా బిల్లులు చెల్లించాలని, లేబుల్ కల్గిన విత్తనాలనే మాత్రమే విక్రయించాలన్నారు. అలాగే రైతులు కొనుగోలు చేసిన వాటికి తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలన్నారు.